వాహనం ఏదైనా..
ఎగిరిపడాల్సిందే..!


వర్షం కురిసిన సమయంలో చెరువును తలపిస్తున్న యల్లయ్యనగర్ దగ్గర రోడ్డు


పెట్రోలు బంక్ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

- చీమకుర్తి నుంచి మర్రిచెట్లపాలెం వరకు గోతులమయంగా ఒంగోలు-కర్నూలు రోడ్డు
- బైకులైనా, బస్సులైనా.. ప్రయాణికులకు నడుములు పోవాల్సిందే..
- రాష్ట్రీయ రహదారి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీ
- అయినా పట్టించుకోని పాలకులు, అధికారులు
- గ్రానైట్ వాహనాల రాకపోకలతో పెరిగిపోతున్న గోతులు

చీమకుర్తి రూరల్: ఒంగోలు-కర్నూలు రాష్ట్రీయ రహదారి చీమకుర్తి నుంచి మర్రిచెట్లపాలెం వరకు అడుగడుగునా గోతులతో నిండిపోయి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. తూర్పువైపు నుంచి వచ్చేవారు చీమకుర్తి రాగానే.. పడమర వైపు నుంచి వచ్చేవారు మర్రిచెట్లపాలెం రాగానే భయపడిపోయేలా చేస్తోంది. సుమారు 10 కిలోమీటర్ల ప్రయాణానికి ప్రజలు నరకం చూస్తున్నారు. రోడ్డుపై భారీ గుంతల్లో వాహనాలు పడిలేస్తూ ప్రయాణికులు ఎగిరెగిరిపడుతూ నడుములు పోగొట్టుకుంటున్నారు. బైకులు, ఆటోలు, కార్లు, బస్సులు, లారీలు.. ఏ వాహనమైనా పైకెగిరి పడటం తప్పడం లేదంటూ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలకు నదిని తలపించిన రోడ్డు...

గత సోమవారం నుంచి మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు చీమకుర్తి - మర్రిచెట్లపాలెం రోడ్డు చిన్నపాటి నదిని తలపించింది. రోడ్డుపైనా, గుంతల్లో భారీగా వర్షం నీరు నిలిచింది. ఆ నీటిలో ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ రోడ్డు ఉందో అర్థంగాక వాహనదారులు వణికిపోయారు. ప్రాణాలు అరచేత పట్టుకుని రాకపోకలు సాగించారు. యల్లయ్యనగర్ పెట్రోల్ బంక్ వద్ద, గ్రానైట్ క్వారీలు, కంకర మిల్లుల ప్రాంతంలో రోడ్డు మరీ అధ్వానంగా తయారైంది. గ్రానైట్ వాహనాల రాకపోకలతో రోజురోజుకూ రోడ్డుపై గుంతల సైజు పెరిగిపోతోంది. చీమకుర్తి తూర్పు వైపు శివారు ప్రాంతం నుంచి మర్రిచెట్లపాలెం ముసి నది వరకు ప్రయాణమంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. పశ్చిమ ప్రకాశం, రాయలసీమ జిల్లాల నుంచి ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు ముఖద్వారంగా ఉన్న ప్రధాన రహదారి పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పటికీ అధికారులు, కూటమి ప్రభుత్వ పాలకులు పట్టించుకున్న పాపాన పోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ రోడ్డుపైనే వారు కూడా ప్రయాణిస్తున్నా చలనం లేకపోవడంతో తిట్టిపోస్తున్నారు. వర్షాలకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా.. నాలుగు రోజులు కూడా సక్రమంగా ఉండటం లేదు. ఈ ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో చిన్న చిన్న గోతులు కాస్తా వర్షాలకు భారీ గుంతలుగా మారిపోతున్నాయి. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించాలంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న మర్రిచెట్లపాలెం-చీమకుర్తి రోడ్డుకు కూటమి ప్రభుత్వం వెంటనే శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.1.15 కోట్లకు ప్రతిపాదనలు పంపించాం :

చీమకుర్తి - మర్రిచెట్లపాలెం రోడ్డును కొత్తగా నిర్మించేందుకు రూ.1.15 కోట్లకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే రోడ్డు నిర్మిస్తాం. తరచూ చిన్న చిన్న గోతులు ఏర్పడి వర్షాలకు పెద్దవిగా మారుతున్నాయి. ప్రస్తుతం దాతల సహాయంతో కంకర మెటల్ వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేశాం

దాసరి మాధవరావు, ఆర్అండ్‌బీ ఏఈఈ

చాలా ఇబ్బందిపడుతున్నాం :



చీమకుర్తి తూర్పు బైపాస్ కూడలిలో గోతులు పడటం వలన చాలా ఇబ్బంది పడుతున్నాం. ఈ ప్రాంతంలో వాహనదారులు చాలా మంది ప్రమాదాలకు కూడా గురయ్యారు. ఈ రోడ్డును వెంటనే బాగుచేయాలి.

మాగులూరి మార్క్, స్థానికుడు


యల్లయ్యనగర్ వద్ద భారీ గుంతల్లోనే రాకపోకలు సాగిస్తున్న వాహనాలు


చీమకుర్తి తూర్పు బైపాస్ కూడలిలో దుస్థితి..

ఇష్టమున్న పంచాయతీలకేనా సీసీ రోడ్లు..?

- రూ.7.50 కోట్లతో 7 పంచాయతీలకే సీసీ రోడ్లు ఎలా మంజూరు చేస్తారు
- మిగతా పంచాయతీల సంగతేంటి.?
- ఇది రాజ్యాంగానికి విరుద్ధం
- జనాభా ప్రాతిపదికన అన్ని పంచాయతీలకు నిధులివ్వాలి
- మండల సర్వసభ్య సమావేశంలో వ్యతిరేకిస్తున్నట్లు తీర్మానం పుస్తకంలో రాయాలి
- కొత్తపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో రచ్చ


సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, పాల్గొన్న అధికారులు, ఎంపీటీసీలు

కొత్తపట్నం: మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉంటే కేవలం 7 పంచాయతీలకే నిధులు ఎలా కేటాయిస్తారు, ఇది రాజ్యాంగానికి విరుద్ధం, ఇది పచ్చిమోసమని శుక్రవారం జరిగిన కొత్తపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రశ్నించారు. అవసరమైన దగ్గర రోడ్లు వేయకుండా మీకు ఇష్టమొచ్చినట్లు నిధులెలా మంజూరు చేస్తారు.? పాలకుల పాత్ర అధికారులే పోషిస్తున్నారా.. లేకుంటే ఎమ్మెల్యే ఏది చెబితే అది చేస్తున్నారా..? అని ధ్వజమెత్తారు. 7 పంచాయతీలకు కేటాయించిన రూ.7.50 కోట్ల నిధులు రద్దు చేసి జనాభా ప్రాతిపదికన ఏ పంచాయతీకి ఎంత వస్తుందో అంతమొత్తాన్ని 15 పంచాయతీలకు సమానంగా కేటాయించి సీసీ రోడ్లు వేసేలా నిధులు కేటాయించాలని, ఆ విషయాన్ని సర్వసభ్య సమావేశం తీర్మానం పుస్తకంలో రాయాలని డిమాండ్ చేశారు. ఈతముక్కల, గమ్మళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, కె.పల్లెపాలెం, రంగాయపాలెం, పాదర్తి, గాదెపాలెంలో కలిపి 186 వర్కులకుగానూ రూ.7.50 కోట్లు మంజూరు చేశారు. 15 పంచాయతీలకు తీర్మానాలు పంపించారు. అయితే, కేవలం 7 పంచాయతీలకు మాత్రమే మంజూరు చేయించారు. దీనిపై సర్వసభ్య సమావేశంలో కొత్తపట్నం ఎంపీటీసీ సభ్యుడు రామలింగం వెంకట్రావు మాట్లాడుతూ అన్ని పంచాయతీల కంటే కొత్తపట్నం పంచాయతీ జనాభా ఎక్కువ ఉన్నప్పటికీ ఒక్క రోడ్డు కూడా మంజూరు ఎందుకు చేయలేదో చెప్పాలని ఏపీవో రత్నజ్యోత్స్నను ప్రశ్నించారు. ముందు జనాభా నివసిస్తున్న ప్రాంతాలకు రోడ్లు వేయకుండా జనసంచారం లేని ప్రాంతాలకు ఎందుకు రోడ్లు మంజూరు చేశారని, ఇది పెద్ద మోసమని అధికారులను నిలదీశారు. దీనిని మార్చి న్యాయంగా జనాభా ప్రాతిపదికన రోడ్లు వేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు.

15 పంచాయతీలకూ సీసీ రోడ్లు మంజూరు చేయాలి : ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన మండలంలోని 15 పంచాయతీలకూ సీసీ రోడ్లు మంజూరు చేయాలని కోరారు. సర్వసభ్య సమావేశానికి రాని గ్రామ, మండల స్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు అందజేయాలని ఆదేశించారు. కె.పల్లెపాలెం నుంచి గుండమాల వరకు 9 కిలోమీటర్ల సీసీ రోడ్డు, ఈతముక్కల జగనన్న కాలనీని కలుపుకుంటూ మడనూరు వరకు సీసీ రోడ్డు నిర్మించాలని మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. కౌలు రైతులకు, వెబ్‌ల్యాండ్‌లో లేని వారికి కూడా రైతు భరోసా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో అమలు జరుగుతున్న ప్రభుత్వ పథకాల గురించి ఎంపీటీసీలు, పంచాయతీ సర్పంచ్‌లకు చెప్పడం లేదన్నారు. ఇచ్చిన పథకాల గురించి అందరికీ జెరాక్స్ కాపీలివ్వాలని ఆదేశించారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు మాట్లాడుతూ అల్లూరు గ్రామానికి శ్మశానం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. శ్మశానం స్థలానికి కొలతలు కొలిచి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏవో మోహన్‌రావు, పశువైద్యాధికారి అనూషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, ఎంపీడీవో పారా శ్రీకృష్ణ, ఈవోఆర్డీ వేణు, ఏవో శ్రీనివాసులు, ఉద్యానవనశాఖ ఏఈ తేజ, డాక్టర్లు శివపార్వతి, వైష్ణవి, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ రామ్‌కుమార్, ఏపీఎం విజయ, ఆర్ఐ వరప్రసాద్, హౌసింగ్ ఏఈ నాంచార్లు, ఎంఈవో తులసీకుమారి, కోఆప్షన్ మెంబర్ బాజీ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తప్పనిసరి

కొత్తపట్నం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గొర్రెలు, మేకలకు వివిధ రకాల వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా నట్టల నివారణ మందు తాపించాలని పశుసంవర్ధకశాఖ ఒంగోలు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ ఏ రమేష్‌బాబు సూచించారు. మండలంలో ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గొర్రెలు, మేకలలో బాహ్య పరాన్నజీవులు, అంతర పరాన్నజీవులైన ఏలికపాములు, బద్దె పురుగులు, ఖార్జపు జలగలు, పొట్ట జలగలు ఏర్పడటం వలన జీవాలు బలహీనపడి మరణిస్తాయన్నారు. సకాలంలో మందులు తాగించకుంటే జీవాలు మరణించడం వలన గొర్రెల పెంపకందారులు నష్టపోతారని హెచ్చరించారు. అంతేగాకుండా జీవాల ఉత్పత్తి, ఉత్పాదక శక్తి, పునరుత్పత్తి సమస్యలు, రోగ నిరోధక శక్తి తగ్గి జీవాలు వ్యాధుల బారిన పడి మరణాలు సంభవిస్తాయని తెలిపారు. కొత్తపట్నం పశువైద్యాధికారిణి డాక్టర్ టి.అనూష మాట్లాడుతూ కొత్తపట్నం మండలంలో 22,664 గొర్రెలు, 802 మేకలకు నట్టల నివారణ మందు తాగించడం ద్వారా 297 మంది గొర్రెలు, మేకల పెంపకందారులకు లబ్ధిచేకూరిందని వివరించారు. కార్యక్రమంలో 660 గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించడం జరిగిందన్నారు. పశువైద్య సిబ్బంది వై.వెంకట్రావు, జి.మణికుమార్, కె.జ్యోతి, రైతులు పాల్గొన్నారు.


నట్టల నివారణ మందును ప్రారంభిస్తున్న రమేష్‌బాబు, అనూష

జీవాల్లో నట్టల నివారణ ప్రధానం

నాగులుప్పలపాడు: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించడం చాలా ముఖ్యమని పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి అన్నారు. గొర్రెల్లో నట్టల నివారణ కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో ఆమె ప్రారంభించి మాట్లాడారు. నట్టల నివారణ మందు తాగించడం ద్వారా జీవాలు వ్యాధులకు దూరంగా ఉండి ఆరోగ్యకరంగా ఉంటాయని తెలిపారు. అనంతరం పశువుల రైతులు 35 మందికి 60 శాతం సబ్సిడీపై 6 టన్నుల టీఎంఆర్ దాణా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేఖ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న జేడీ బేబీరాణి

క్లుప్తంగా

అభ్యసన సమస్యలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఐఈఆర్‌టీఎస్ సిబ్బంది, హెచ్ఎం, ఉపాధ్యాయులు

మద్దిపాడు: మద్దిపాడు పైపాలెం ఎంపీపీ స్కూల్లోని భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, పాఠశాలలోని విద్యార్థులతో ప్రపంచ డిస్లెక్సిమా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శేషగిరి మాట్లాడుతూ విద్య నేర్చుకునే విభిన్నతలను కలిగి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అభ్యసన సమస్యలు తెలుసుకుని విభిన్న రీతులలో విద్యాబోధన చేయించాలని ఐఈఆర్‌టీఎస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటిరెడ్డి, శారద, రమాప్రభ, నాగలక్ష్మి వీవీ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్నాటి సేవలు మర్చిపోలేము


నాగేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న ఏపీఈజేయూ నాయకులు

ఒంగోలు టౌన్: జర్నలిస్టుల సంక్షేమం కోసం నిజాయితీగా పోరాడిన పల్నాటి నాగేశ్వరరావు సేవలను ఎప్పటికీ మర్చిపోలేమని ఏపీ ఈజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రి అన్నారు. గురువారం నగరంలోని ఎంసీఏ భవనంలో సీనియర్ జర్నలిస్టు పల్నాటి నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు జర్నలిస్టులు, ఏపీఈజేయూ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన


కండ్లగుంటలో శంకుస్థాపన చేస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలో సుమారు రూ.4 కోట్ల పైచిలుకు నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని చేకూరపాడు, బీ నిడమానూరు, పోతవరం, ఓబన్నపాలెం, కండ్లగుంట, ముప్పాళ్ళ, మట్టిగుంట గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, మనోజ్, వెంకట సుబ్బయ్య, ఏపీఎం బత్తుల నరేంద్ర, సెక్రటరీ ప్రవీణ్, పిట్టు సురేష్, కొమ్ము క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న జోసఫ్ కుమార్, వెంకటస్వామి

కొత్తపట్నం: ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.4.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్ కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని గమ్మళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం పంచాయతీలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాలేటి వెంకటస్వామి, ఎంపీడీవో శ్రీకృష్ణ, శ్రీనివాసరెడ్డి, గేనం సుబ్బారావు, రామచంద్రయ్య, పోల్‌రాజు, ఏపీవో రత్నజ్యోత్స్న, జేఈ చంద్రశేఖర్, ఈవోపీఆర్‌డీ వేణు, పీఆర్ ఏఈ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఒంగోలు టౌన్: ఒంగోలు ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యల పరిష్కరించే ఉద్దేశంతో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందుకు గాను ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ ఫోన్ నంబర్ 9959225695కు ఫోన్ చేసి తమ సమస్యలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకొని రావలసిందిగా కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయ ఏఓకు వీడ్కోలు


ఏఓ సులోచనను సన్మానిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సుదీర్ఘకాలంగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)గా విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా ఏపీఎస్పీ 9వ బెటాలియన్‌కు వెళ్తున్న ఎం.సులోచనకు శుక్రవారం వీడ్కోలు పలికారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్, ఇతర పోలీసు అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ఆరేళ్లపాటు ఏఓగా సులోచన పనిచేయడం గొప్ప విషయమన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆమె సేవలందించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి అందాల్సిన ప్రయోజనాలు, రావాల్సిన బకాయిలు, మరణించిన సిబ్బందికి శాఖాపరంగా అందాల్సిన బెనిఫిట్స్‌ను సకాలంలో అందజేయడానికి ఆమె తనవంతు పాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీపీఓ నూతన ఏఓ రామ్మోహన్, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణారెడ్డి, సీతారామరెడ్డి, ఏఏఓ ఉస్మాన్‌బాషా, డీపీఓ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు: విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై సుమారు 20 వేల కోట్ల రూపాయల భారం మోపడాన్ని రద్దు చేయాలని సీపీఎం సంతనూతలపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ ఒకసారి కొనుక్కుని వినియోగించుకున్న వస్తువుకు డబ్బు చెల్లిస్తామని, మళ్లీ చెల్లించమని ఎప్పుడూ అడగరని, కానీ విద్యుత్‌కు మాత్రం కూటమి ప్రభుత్వం అలా అడగడం దుర్మార్గమైన చర్యని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూటమి నేతలు బాదుడే బాదుడు అంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత అంతకుమించిన భారాలను ప్రజలపై మోపడం సమంజసం కాదన్నారు. మరోవైపు మద్యం, ఇసుకతో అధిక ధరల భారాన్ని కూడా మోపుతున్నారన్నారు. వెంటనే ఆయా భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీవోకు సన్మానం


సుజాత, బాలచెన్నయ్య, నరేంద్రదేవ్, సతీష్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు

కొత్తపట్నం: ఐదేళ్ల పాటు కొత్తపట్నం ఎంపీడీవోగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన పి.సుజాతను శుక్రవారం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఎంపీటీసీలు ఆళ్ల రవీంద్రరెడ్డి, మిట్నసల శాంతారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, ఇతర నాయకులు, అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల పాటు మండలానికి ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఎంపీడీవోతో పాటు బదిలీపై వెళ్లిన ఈవోఆర్డీ బాలచెన్నయ్య, ఏవో నరేంద్రదేవ్, సతీష్‌లను కూడా అభినందించి సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శుద్ధి చేసిన నీటిని సద్వినియోగం చేసుకోవాలి


సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లో శుద్ధి చేసిన నీటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో గుత్తికొండవారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటును శుక్రవారం ఆయన సందర్శించారు. గుత్తికొండవారిపాలెం వద్ద గల ఈ ప్లాంటుకు సంబంధించిన వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్‌ను నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధుల నుంచి ప్లాంట్ ఆపరేషన్, మెయింటెనెన్స్ వివరాలడిగి తెలుసుకున్నారు. ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేయబడిన నీటిని పరీక్ష చేసే లేబొరేటరీని కూడా పరిశీలించారు. అనంతరం గుత్తికొండవారిపాలెం వద్ద గల వేస్ట్ డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. అక్కడున్న చెత్తను విండ్రో కంపోస్ట్ పద్ధతి ద్వారా ఎరువుగా మార్చే ప్రాంతాన్ని తనిఖీ చేశారు. డంపింగ్ యార్డ్ లోపల వాహనాల రాకపోకలు సులువుగా సాగించేలా మార్గాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజుకు ఎన్ని వాహనాలు చెత్తను డంప్ చేస్తున్నాయో సూచించే లాగ్ బుక్‌ని పరిశీలించి ఇంకా మరికొన్ని వివరాలు అందులో పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజినీర్‌కి సూచించారు. బయో గ్యాస్ ప్లాంట్ కోసం ఒంగోలు నగరపాలక సంస్థ సూచించిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం సంతపేట పరిధిలోని నాటు బాబూరావు పార్క్‌ని సందర్శించి మొక్కలను ట్రిమ్ చేయాలని, పార్క్‌లో ఉన్న ఖాళీ వాటర్ బాటిల్స్ తీసివేయాలని వాచ్‌మెన్‌ని ఆదేశించారు. కమిషనర్ వెంట ఇంజినీరింగ్ అధికారులు, నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్, శానిటరీ సూపర్‌వైజర్, తదితరులు ఉన్నారు.

నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లు కూల్చేశారు


మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

ఒంగోలు టౌన్: గత 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లు కూలగొట్టారని బాధితులు నూకతోటి పిచ్చమ్మ, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పేర్నమిట్టలోని పారిశ్రామికవాడ వద్ద రోడ్డు పక్కన టుబాకో బోర్డు నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు ఉన్న 10 గృహాలను ఏపీఐఐసీ అధికారులు కూల్చివేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఎస్పీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలు శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. మాకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా అధికారులు మా ఇళ్లు కూలగొట్టారని విలపించారు. కనీసం మాకు ఇంటి సామగ్రి సర్దుకోవడానికి కూడా అవకాశం ఇవ్వలేదని ఆవేదన చెందారు. ఇళ్లలో నిద్రపోతున్న పిల్లలను బలవంతంగా లేపుకుని బయటకు వచ్చామంటూ రోదించారు. కలెక్టర్ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకులు కైలా వెంకటరావు, బాధితులు బాలేశ్వరమ్మ, అమ్మనబ్రోలు రత్తమ్మ, ఎస్కే నజీర్, బీబీ ఫాతిమా, ట్రాన్స్‌జెండర్ కరిష్మా, మరో 20 మంది పాల్గొన్నారు.